19102024-DIS-04_Layout 1 10/19/2024 3:22 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఆరు గ్యారెంటీల ఊసే రాదేం!

బుద్ధా మురళి

పాలకుల దృష్టిలో ఇప్పుడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మూసీ నది మురికి. ఫ్లోరోసిస్ సమస్యతో నల్లగొండ జిల్లాకు చెందిన అనేక గ్రామాల ప్రజలు శరీరం అంతా వంకరపోయి, జీవచ్ఛవాలుగా బతుకుతున్న వారిని చూసి అంత పెద్దాయన వాజపేయి కూడా కంటనీరు పెట్టుకున్నప్పుడు కూడా గుర్తుకురాని సమస్య నల్లగొండ జిల్లాకు చెందిన పెద్ద పెద్ద నాయకులకు హఠాత్తుగా మూసీ కంపు సమస్య గుర్తుకువచ్చింది. ఎప్పుడు గుర్తుకువస్తేనేం చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేల్కొల్పితే హఠాత్తుగా వీరికి మూసీ మురికి గుర్తుకువచ్చింది. మూసీని నేను అద్భుతంగా తీర్చిదిద్దాలనుకుంటే నల్లగొండ జిల్లా నాయకుల నుంచి కూడా స్పందన రాకపోవడం బాధ కలిగించిందని ముఖ్యమంత్రి ఆవేదన చెందినట్టు వార్తలు వచ్చాక ఆ జిల్లా నాయకులు మూసీ కంపుపై మాట్లాడటం మొదలుపెట్టారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉపయోగపడిన ఆరు గ్యారంటీలను అటకెక్కించి ఎన్నికల్లో ఎప్పుడూ చెప్పని హామీని హైడ్రాను తెరపైకి తీసుకువచ్చారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి కంటిముందు కనిపిస్తున్న ఏకైక సమస్య మూసీ సుందరీకరణ. దీని కోసం హైడ్రాను రంగంలోకి దించారు. లక్షా 50 వేల కోట్లతో మూసీ నదిని సుందరీకరించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలుత ప్రకటించారు. ఇప్పుడు లక్షా 50 వేల కోట్ల అంకె ఎక్కడి నుంచి వచ్చిందని అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. సుందరీకరణ కాదు ప్రక్షాళన అని చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ గురించి చెప్పిన మాటలు, లక్షా 50 వేల కోట్ల రూపాయల అంకె ఎక్కడినుంచి వచ్చిందని ప్రశ్నిస్తున్న ఉపన్యాసం.. ఈ రెండు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఏడాదిలోపే ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడటం పట్ల రేవంత్‌రెడ్డికి అండగా నిలిచే మీడియాకు సైతం ఆందోళన కలిగించింది. జాగ్రత్త రేవంత్ నీ చుట్టూ ఉన్నవాళ్లు నీకు సరైన సలహాలు ఇవ్వడం లేదు, నిన్ను ముంచేస్తారని హితబోధ చేస్తున్నారు.

ఎవరో నడిపిస్తే నడవడం, ఎవరో చెప్తే వినే రకం కాదు రేవంత్‌రెడ్డి. అప్పుడే రాజకీయాల్లోకి వచ్చి ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ వంటి ప్రాంతీయ పార్టీలో శాసనమండలి సభ్యునిగా గుంపులో కాకుండా వన్ మాన్ షోగానే ఉండేవారు. రేవంత్‌రెడ్డి అనే కాదు ఏ రాజకీయ నాయకుడైనా తన రాజకీయ భవిష్యత్తు, తన ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటారు కానీ, ప్రజలకు మేలు చేయాలనేంతటి చిత్తశుద్ధి కెరీరిస్టు నేతల నుంచి ఆశించడం అత్యాశే అవుతుంది. లక్షా 50 వేల కోట్లు- హైడ్రా- మూసీ ప్రక్షాళన వ్యవహారం వెనుక ఏదో ఉంటుంది. ఏదో ఒకరోజు బయట పడుతుంది. దేశవ్యాప్తంగా బీజేపీపై పోరాడేందుకు కాంగ్రెస్‌కు ఆర్థికంగా అండగా ఉండే రాష్ట్రాలు రెండే రెండు. ఒకటి కర్ణాటక కాగా, మరొకటి తెలంగాణ. శూన్యం నుంచి కేసులు పుట్టించగల నరేంద్ర మోదీ బృందం కాంగ్రెస్‌కు ఆర్థికంగా అండగా రాష్ట్రాలను చూసీ చూడనట్టు వదిలేస్తారా? కర్ణాటక ముఖ్యమంత్రి కుంభకోణంలో ఇరికారు. ఇక ఆయన పదవిలో ఉంటారో, వదిలేస్తారో చూడాలి. మిగిలిన ఒక్క రాష్ట్రంపై మోదీ కన్ను పడలేదంటే నమ్మలేం. ఈ నేపథ్యంలో రేవంత్ మాట మార్పు దేనికి సూచన?

ప్రక్షాళననా? సుందరీకరణనా? ఏదో పాలకులకే స్పష్టత లేదు. ప్రపంచస్థాయిలో హైదరాబాద్‌ను సుందరంగా తయారుచేసేందుకు మూసీ మురికి శుభ్రం చేయాలని చూస్తే విపక్షాలు అడ్డుకుంటున్నాయని రేవంత్ రెడ్డి ఆవేదన. గంగా ప్రక్షాళనను మెచ్చుకుంటున్న వారు మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారని ఆవేదన చెందారు. నిజానికి విపక్షాలకు రేవంత్‌రెడ్డి బృందమే విమర్శించేందుకు ఆయుధాలు అందిస్తున్నది. రేవంత్‌రెడ్డికి రాజకీయాల్లో ఎదిగే వ్యూహం తెలుసు కానీ, గంగా ప్రక్షాళన వంటి విషయాలు తెలియవు, అలాంటి వాటిపై ఆసక్తి ఉండదు. రేవంత్ రెడ్డి గంగా ప్రక్షాళన గురించి ప్రస్తావించగానే ఏడున్నర వేల కోట్ల రూపాయలతో గంగా ప్రక్షాళన చేస్తే అంతకన్నా తక్కువ నిడివి ఉన్న మూసీ ప్రక్షాళనకు లక్షన్నర కోట్ల రూపాయలు ఎందుకవుతాయని విమర్శలు వచ్చాయి. ప్రజలు మురికిలోనే ఉండాలి, మూసీ మురికిని తొలగించాలని ఎవరూ చెప్పడం లేదు. మురికిలో జీవిస్తున్న వారికి ముందు మరోచోట నివాసం చూపాలి. అన్ని ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు తీసుకొని, స్థలం కొని ఇండ్లు కట్టుకుంటే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తే ఆ ఇండ్లు కొన్నవారు నిస్సహాయులు కాబట్టి కుమిలిపోతారు. తమ ఉసురు తగలాలని తిడతారు. అంతే తప్ప సొంత మీడియా బృందం ప్రచారం చేస్తున్నట్టుగా ఆనందంతో గేట్లు వేస్తూ కొత్త ఇంట్లో పాలు పొంగించరు. ఒక మధ్య వయస్కుడు బ్యాంకు లోన్ తీసుకొని అన్ని అనుమతులతో ఇంటిని నిర్మించుకొని గృహ ప్రవేశం చేస్తే.. గృహ ప్రవేశం చేసిన ఆరు రోజులకే ఇంటిని కూల్చేశారు. ఇప్పటికీ అతను కూల్చేసిన ఇంటి వద్ద రోజూ కాసేపు కూర్చొని ఏడ్చి వెళ్లిపోతున్నాడు. అతనికి సరిగా ఏడవడం కూడా రావడం లేదు కుమిలిపోతున్నాడు. సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి వారి వ్యథ కనిపిస్తున్నది. హైడ్రా రంగనాథ్ కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రధాన మీడియా చూపడం లేదు, సామాజిక మాధ్యమాలు చూపుతున్నాయని తెగ బాధపడిపోయారు. వారన్నది నిజమే కానీ, ఏ మీడియా చూపుతుంది, ఏ మీడియా చూపడం లేదనే దానికన్నా సమస్య నిజమా? కాదా? వారి ఆవేదన నిజమా? కాదా? అనేది చూడాలి. కోట్లాది రూపాయల ఇండ్లు కూల్చారు కానీ, వారికి అనుమతులు ఇచ్చిన వారిపై ఎలాంటి చర్య లేదు.

ఆకర్షణీయంగా ఆరు హామీలను ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు హామీలను పక్కనపెట్టి హైడ్రాను, మూసీని ముందుకు తీసుకువచ్చారు. ఇప్పుడు ప్రజలు ఆరు గ్యారంటీల మాట ఎత్తడం లేదు. మా ఇంటి మీదకు రాకు రేవంత్‌రెడ్డి.. మా మానాన మమ్ముల్ని వదిలేయండని రేవంత్ రెడ్డి మీద పాట కట్టి బతుకమ్మ ఆట ఆడారు. మహిళకు రెండున్నర వేల భరోసా లేదు. వృద్ధాప్య పింఛన్ 2016 నుంచి నాలుగు వేలకు పెంచుతామని చెప్పి 2016ను కాస్తా 2000కు కుదించారు. కల్యాణల క్ష్మికి తులం బంగారం లేదు, విద్యార్థినులకు స్కూటీ లేదు. రైతులకే కాదు, రైతు కూలీలకు కూడా రైతు భరోసా అని హామీ ఇచ్చారు. ఇప్పుడు రైతులకే భరోసా లేనప్పుడు రైతు కూలీల గురించి ఆలోచించేదెవరు? ప్రస్తుతానికి ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నది. ఈ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి ఎప్పుడు ఇస్తుందో చూడాలి. సగం మంది రైతులకు రుణమాఫీ చేసినా మిగిలిన సగం మంది రైతులను అసంతృప్తికి గురిచేశారు. ఆరు హామీలు అమలు చేయాలంటే నిధులు ఉండాలి, అవి లేవు. కూల్చివేతలకు నిధులు అవసరం లేదు, బుల్డోజర్లు చాలు. అందుకే ప్రభుత్వం ఆరు హామీలను పక్కనపెట్టి అసలు హామీ ఇవ్వని హైడ్రాను నమ్ముకున్నది.

ఏడాదిలోపే ఇలా ఉంటే తర్వాత ఎలా ఉంటుందో కాలమే చెప్తుంది. ఏ హామీలతో తాము అధికారంలోకి వచ్చామో వాటికి ప్రాధాన్యం ఇచ్చి అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పాలకులది. తెలంగాణలో అమలు చేయకపోతే ఇతర రాష్ట్రాల్లో సైతం కాంగ్రెస్‌పై ప్రభావం ఉంటుంది. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అధికారంలోకి తేవడంతో కాంగ్రెస్ హర్యానాలో ఇంకొకటి కలిపి ఏడు గ్యారంటీలు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ హర్యానా ప్రచారంలో తెలంగాణలో అమలుకు నోచుకోని హామీల గురించి ప్రచారం చేశారు. రుణ మాఫీ అంటూ తెలంగాణలో రైతులను మోసం చేశారని మోదీ హర్యానాలో ప్రచారం చేశారు. ఫలితం మన కండ్లముందే ఉన్నది.

మత్స్యారంగంపై కక్ష... నిర్లక్ష్యం!

పిట్టల రవీందర్

సుమారు తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనాకాలంలో తెలంగాణ మత్స్యరంగం ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలకు దారులు చూపింది. కానీ, గత తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ మత్స్యరంగం కక్షపూరితమైన నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నది. ఈ రంగం మీద ఎన్నో ఆశలను పెట్టుకున్న లక్షలమంది మత్స్యకార కుటుంబాలు తీవ్ర భయాందోళనల మధ్య బిక్కుబిక్కుమంటూ అగమ్యగోచరంగా గత వైభవం కోసం ఎదురుచూస్తున్నారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు పూర్తి వివక్షకు గురైన తెలంగాణ ప్రాంత మత్స్యరంగాన్ని దేశంలోనే అత్యున్నతమైన స్థాయిలో నిలిపేందుకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాలను సర్వతోముఖాభివృద్ధి దిశలో నడిపించేందుకు నడుం కట్టడమే కాకుండా, వేల కోట్ల రూపాయల వ్యయంతో అమల్లోకి తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుకుచేసుకుంటూ వర్తమానకాలంలో తాము ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను తలచుకొని తల్లడిల్లిపోతున్నారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ మత్స్యరంగం వందేండ్లు వెనుకబడిపోయింది. అత్యంత ప్రాధాన్యం కలిగిన మత్స్య రంగానికి కనీసం మంత్రి కూడా లేకపోవడం ఇప్పటి ప్రభుత్వ వివక్షపూరిత వైఖరికి నిదర్శనమే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ఉదార వైఖరితో రాష్ట్రంలో మత్స్యరంగం అభివృద్ధికి, తద్వారా ఈ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న లక్షల మంది మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు అనేక పథకాలను అమల్లోకి తీసుకువచ్చింది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి నెలకొని ఉన్న పరిస్థితులకు, పదేండ్ల బీఆర్ఎస్ పాలనా కాలంలో అమలుచేసిన కార్యక్రమాలను బేరీజు వేసుకుంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మత్స్యరంగం పట్ల అనుసరిస్తున్న వివక్షత అర్థమవుతుంది. దశాబ్దాలపాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ మత్స్యరంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక పకడ్బందీ ప్రణాళికతో మూడంచెల విధానాన్ని రూపొందించుకున్నది. ఆ విధానాన్ని పటిష్ఠమైన పద్ధతుల్లో అమలుపరిచేందుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. చేపల పెంపకానికి అవసరమైన చెరువులను పటిష్ఠపరిచి నీటి వనరులను స్థిరీకరించింది. మౌలిక వసతులను విస్తృతపరచడం, రాష్ట్రంలోని మత్స్య సహకార సంఘాలను, సభ్యులైన మత్స్యకారుల్లో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు చేయూతనివ్వడం, సంస్థాగత నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించడం లాంటివి ప్రధానాంశాలుగా ఉన్నాయి. కేవలం విధానపరమైన నిర్ణయాలను ప్రకటించి చేతులు దులుపుకోకుండా, వాటిని అమలుపరిచేందుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టు, దానికి అనుబంధంగా నిర్మించిన జలాశయాలు, గోదావరి నదీ గర్భానికి సంబంధించిన బ్యాక్ వాటర్స్‌తో పాటుగా, మిషన్ కాకతీయ పథకాన్ని అమలుపరచడం ద్వారా రాష్ట్రంలోని చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన నాడు మన రాష్ట్రంలో కేవలం ఆరు లక్షల హెక్టార్లుగా ఉన్న నీటి విస్తీర్ణ సామర్థ్యం పై చర్యల ఫలితంగా ఏడున్నర లక్షల హెక్టార్లకు చేరుకున్నది. రాష్ట్రంలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు ఏడాది పొడవునా చెరువుల్లో జల వనరులు అందుబాటులోకి వచ్చాయి. అప్పటివరకు ఏటా మూడు నెలలు మాత్రమే కొనసాగిన చేపల వేట ఏడాది పొడవునా పూర్తికాలపు వృత్తిగా మారిపోయింది. ఫలితంగా చేపల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. 2014లో తెలంగాణ ప్రాంతంలో సుమారు రెండు లక్షల టన్నులుగా నమోదైన వార్షిక చేపల ఉత్పత్తి 2023 నాటికి నాలుగున్నర లక్షల టన్నులు దాటింది. ఈ మేరకు రాష్ట్రంలోని మత్స్యకారుల ఆదాయ వృద్ధి కూడా నమోదైంది. గతంలో తెలంగాణలోని మత్స్యసహకార సంఘాలలో సభ్యులుగా నమోదు కావడానికి ప్రామాణికంగా నిర్ణయించిన హెక్టారు విస్తీర్ణాన్ని ఎకరం విస్తీర్ణానికి కుదించడంతో సభ్యుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోయింది. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి తెలంగాణలోని మత్స్యసహకార సంఘాలలో సభ్యులుగా నమోదైన సుమారు రెండున్నర లక్షలమంది సభ్యుల సంఖ్య 2023 నాటికి నాలుగున్నర లక్షలకు పెరిగింది. ఈ మేరకు మత్స్యసహకార సంఘాల సంఖ్య కూడా గతంలో ఉన్న మూడున్నర వేల నుంచి ఆరు వేలకు పెరిగింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంస్థాగతమైన మార్పులతో పాటు మత్స్యకారుల్లో ఆర్థిక స్వావలంబనను సాధించే దిశలోనూ సమాంతర కృషి జరిగింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రికగా ప్రపంచవ్యాప్తంగా మన్ననలందుకున్న రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టడానికి రెండేండ్ల ముందుగానే తెలంగాణలో అప్పటి ప్రభుత్వం 2016లో దేశంలోనే మొట్టమొదటిసారిగా ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం ఈ పథకాన్ని కొనసాగించింది. రాష్ట్రంలో మత్స్యరంగాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశలో నడిపించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా వెయ్యి కోట్ల రూపాయల భారీ నిధులను సేకరించి సమగ్ర మత్స్య అభివృద్ధి పథకాన్ని అమలుపరిచింది. ఈ పథకం ద్వారా సుమారు లక్షా 30 వేల మంది మత్స్యకారులు తెలంగాణ రాష్ట్రంలో నేరుగా లబ్ధి పొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో మత్స్యరంగంలో ఉన్నత విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు రెండు ఫిషరీస్ కళాశాలలను ఏర్పాటుచేయాలనే నిర్ణయం తీసుకున్నది. అందులో ఒక టి వనపర్తి జిల్లా పెబ్బేరులో ప్రారంభించి నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల నుంచి ఇప్పటికే నాలుగు బ్యాచ్‌లకు సంబంధించిన విద్యార్థులు తమ డిగ్రీల ను పూర్తి చేసుకుని దేశంలోని పలు ప్రాంతాలలో ఫిషరీస్, ఆక్వాకల్చర్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణలో పూర్వపు 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించిన దరిమిలా రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలను కూడా విస్తరించేందుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా మత్స్య, ఆక్వారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ మత్స్యరంగాన్ని తీర్చిదిద్ది, ఇక్కడి మత్స్యకారుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో మేడ్చల్‌లో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో ఒక సమీకృత మత్స్య శిక్షణా కేంద్రాన్ని, దానికి అనుబంధంగా అధునాతనమైన ఒక వసతి గృహాన్ని కూడా నిర్మించింది. ఇక్కడే ఒక అధునాతన ఫిషరీస్ లాబోరేటరీని కూడా స్థాపించాలని సంకల్పించింది. రాష్ట్రంలో చేపల ఆహార వినియోగాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఫిష్టారెంట్లను ఏర్పాటుచేసి సంస్థాపరంగానే నిర్వహించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా గత సంవత్సరం మృగశిర కార్తె రోజున ప్రారంభించుకొని మూడురోజుల పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది. పైన పేర్కొన్న ఈ పరిణామాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఏటా బహుకరించే ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ చేపల ఉత్పత్తి రాష్ట్రం అవార్డుకు 2021కి గాను తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపిక చేసింది. మంచి నీటి చేపల పెంపకానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకతలను సాధించడంతోపాటుగా మొత్తం పది అంశాలలో ఉన్నతమైన ప్రమాణాలను సాధించినందుకుగాను అంతర్జాతీయ మత్స్య దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును అప్పటి కేంద్ర మత్స్యశాఖ మంత్రి రూపాలా చేతుల మీదుగా 2021, నవంబర్ 21న భువనేశ్వర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ మత్స్యశాఖ అధికారులు అందుకున్నారు.

అయితే, ఈ ఘన కార్యాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి గత చరిత్రగా మిగిలిపోవడం విచారకరం. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన మత్స్యరంగాన్ని బుద్ధిపూర్వకంగా విస్మరించి, నిర్లక్ష్య ధోరణులను ప్రదర్శించినట్టుగానే వర్తమాన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. సుమారు పదేండ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని కంటికిరెప్పలా కాపాడిన కేసీఆర్ తెలంగాణ మత్స్యరంగాన్ని ఉన్నతస్థాయికి తీర్చిదిద్దేందుకు వేసిన పునాదులను కూకటివేళ్లతో పెకిలించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృతనిశ్చయంతో ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తున్నది. అంతే కాదు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకానికి తూట్లుపొడిచింది. జలాశయాల్లో రొయ్య పిల్లల పంపిణీని పూర్తిగా రద్దుపరిచింది. జిల్లా మత్స్యసహకార సంఘాలకు పూర్తిస్థాయిలో ఎన్నికలు నిర్వహించడం లేదు. రాష్ట్రస్థాయి ఫిషరీస్ ఫెడరేషన్‌కు పూర్తిస్థాయి పాలక మండలిని ఏర్పాటు చేసేందుకు అవరమైన ఎన్నికల ప్రక్రియనును నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖను కూడా నిర్వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంతవరకు కనీసం ఈ శాఖపై కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదు. ముఖ్యమంత్రి తన మానస పుత్రికగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో అక్వాకల్చర్ రంగానికి సంబంధించి కనీసం ఒక్క కోర్సును కూడా ప్రవేశపెట్టలేదు. కేంద్రప్రభుత్వ నిధులతో అమలు జరుపుతున్న ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకాన్ని రాష్ట్రంలోని మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఫిషరీస్ ఫెడరేషన్‌కు సంబంధించిన గత పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను అమలుపరుచకుండా తాత్సారం చేస్తున్నది. ఇలాంటి పలు అంశాలు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మత్స్యరంగం పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత నిర్లక్ష్య విధానాలకు అద్దం పడుతున్నాయి.

(వ్యాసకర్త: తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలలో కొత్తవారిని సభ్యులుగా చేర్చుకునే ఏకైక లక్ష్యంతో రెండు దశల్లో దాదాపు ఏడాది కాలం పాటు ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించింది. ఈ ఘనత దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే దక్కింది.



పంపకాలు తేలేదెప్పుడు?

మహారాష్ట్రలో ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. పొత్తుల సంగతి సత్వరమే తేలాలి. కానీ, కాంగ్రెస్ వాళ్లు ప్రతిదానికీ ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు. ఆ తర్వాతే చర్చలకు వస్తున్నారు. ఇలా అయితే ఎప్పుడు తేలుతుంది?

- సంజయ్ రావూత్, శివసేన ఎంపీ

ఏటమటం

మూడు సముద్రాల ముచ్చట

'సోషల్ మీడియాలో ఏడ జూసినా మీ గురించే ముచ్చట సార్.. ఇటు ఫేసుబుక్కుల, అటు వాట్సప్పుల, ఇన్‌స్టాల, వగైరా, వగైరా... రాష్ట్రం మొత్తంల మీ గురించే చర్చ ఉరుకుతున్నది సారిప్పుడు' అని పీఏ ఇడ్లీ తింటున్న సీఎం సార్‌కు శెప్పిండట. 'శబ్బాష్ మరేమనుకుంటున్నవ్ మనమంటే! ఇంతకూ.. ఆరు గ్యారెంటీల మీదనే గదనయ్యా జనం మనల్ని మెచ్చుకుంటున్నది?' అని పీఏను సీఎం సార్ అడగడంతో మీకు అట్లా అర్థమైందా సార్ అని ముక్కు మీద వేలేసుకున్నడట పీఏ. 'అందుక్కాదు సార్, మొన్న మీరు మూడు సముద్రాల ముచ్చట శెప్పిర్రు గదా, అందుకే సార్ మీరిప్పుడు జనాల నోట్లో నానుతున్నరు' అని పీఏ శెప్పంగనే మొహమంతా శిన్నగ జేసుకున్నడటా సీఎం సార్!

డబుల్ సంపద!

'ముందు మురిసినమ్మ పండుగెరుగదు' అన్నట్టే అయ్యింది ఆంధ్రా మందుబాబుల కథ. 'బాబొస్తారొస్తారు, డెడ్ చీప్‌కే లిక్కర్ ఇస్తారు' అని పాటలు వాడుకున్న మందుబాబులు ఇప్పుడు తలికాయ వట్టుకుంటున్నరట బాబు గోరు వెంచిన ధరలను జూసి. 'బాబొచ్చిండు, మందు తెచ్చిండు.. కానీ, ధరలే మస్తు వెంచిండ'ని పరేషాన్ అయితున్నరట పాపం. ఇంతకుముందు ఒక్క వంద కాయితం ఇస్తే సరిపోయేదని, ఇప్పుడు రెండు వందల కాయితాలు రెండిచ్చినా చిల్లరనే చేతుల వెడ్తున్నరని వాపోతున్నరట. బాబు గోరు ఈ రకంగా సంపదను వెంచి చూపిస్తున్నట్టున్నడు ఏపీ ప్రజలకు. ఒకే సార్ ఆల్ ద బెస్ట్!

ముందు నుయ్యి, ఎన్క గొయ్యి

'ఓడెక్కినంత సేపు ఓడ మల్లయ్య.. ఓడ దిగినంక బోడ మల్లయ్య అన్నట్టే ఉన్నది మా కాంగ్రెస్ నాయకుల కథ' అని ఆ పార్టీ కార్యకర్తలు లోపల్లోపల దిగమింగుకుంటున్నరట వాళ్ల బాధను. గెలిపించినంత సేపు 'కార్యకర్తలే మా దేవుళ్ల'ని కాళ్లు మొక్కిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు 'కార్యకర్తలే పార్టీకి దెయ్యాలు' అంటున్నరట పాపం. ఓరుగల్లు జిల్లాల కార్యకర్తలకు లీడర్లు అండగా ఉంటరనుకుంటే, లీడర్లే కార్యకర్తలను కొడుతున్నరట. కార్యకర్తలనే కొట్టుకుంటా, పైగా వాళ్ల మీద కేసులు వెడ్తున్నరట పాపం. వాళ్లు మా బాధను పై కమాండ్‌కు శెప్పుకుందామని గాంధీభవన్‌కు అస్తే సీన్ రివర్సైందట. కార్యకర్తలకు భరోసా ఇవ్వాల్సిన పీసీసీ అధ్యక్షుడు వాళ్లకే ఉల్టా క్లాస్ దీస్కొని పంపించిండట. మా పరిస్థితి ఇప్పుడు 'ముందు జూస్తే నుయ్యి, ఎన్క జూస్తే గొయ్యి' అన్నట్టే ఉన్నదని మస్తు బాధపడ్తున్నరట కాంగ్రెస్ కార్యకర్తలు!



మాకొద్దు బాబోయ్..

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కొడుకు ఓ స్కాంలో ఇరుక్కోబోయి జర్రంతల తప్పించుకున్నడట. కర్ణాటక రాష్ట్రంల ఏ మూల జూసినా ముడా స్కాం గురించే ఇప్పుడు చర్చ నడుస్తున్నది గదా? అటువంటి స్కామే ఇది. 'మేము మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ పెట్టాలనుకుంటున్నం. బెంగళూర్‌లో ఐదెకరాల భూమి ఇవ్వండి' అని సిద్ధార్థ విహార్ ట్రస్ట్ పేరు మీద ఖర్గే కొడుకు రాహుల్ ఖర్గే దరఖాస్తు వెట్టుకున్నడట. 'అన్నం బెట్టేటోడు మనోడైతే బంతిల ఏ మూలగ్గూసున్నా...' అన్నట్టు సిద్ధరామయ్య ప్రభుత్వం ఆగమేఘాల మీద ఆ ఫైల్ మీన సంతకం జేసిందట. తీరా ముడా స్కాం బయటికి పొక్కడంతో ఖర్గ